బుధవారం 18 మార్చి 2026
అగ్నిధార
http://www.agnidharanews.com

# సంస్కృతి సాహిత్యా సాంప్రదాయాలని కాపాడడం కవుల బాధ్యత- నిరంజన్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**

సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించి స్ఫూర్తి నింపాల్సిన బాధ్యత కవులపై ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో నిర్వహించిన "పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన స్ఫూర్తివంతమైన సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన నిరంజన్ రెడ్డి, నవతరం కవులు వినిపించిన కవితలను ఆసక్తిగా ఆలకించి వారిని సన్మానించి అభినందించారు. తన ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ --- యుగానికి నాంది పలికే ఉగాది పండుగ ప్రజలజీవితాల్లో సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకు విజయాలు కలగాలని కోరారు. సాహిత్యంలో గాంభీర్యం, పట్టు ఉన్న కవితలు ప్రశంసనీయం కాగా, సాధారణ ప్రజలకు అర్థమయ్యే సరళమైన భాషలో కవిత్వం చెప్పడం గొప్ప నైపుణ్యమని తెలిపారు. భాషాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం నవతరం కవుల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. పండుగలు, జాతరలు ప్రజల జీవనశైలిని ప్రతిబింబిస్తాయని, వ్యవసాయ పనుల ఆరంభానికి ఉగాది శుభసూచకమని చెప్పారు. వ్యవసాయాన్ని యజ్ఞంలా భావించే విధంగా కవిత్వం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇప్పటి సమాజంలో మనిషి ఏకాకిగా మారడం ఐక్యతకు ప్రమాదమని, మేధావులు, కవులు ప్రజల్లో అనుబంధాలు పెంచేలా, ప్రపంచ శాంతి నెలకొనేలా తమ రచనల ద్వారా ప్రభావితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, హేమంత్ కుమార్, మంద రాము, చిట్యాల రాము, ముద్దుసార్ తదితర కవులు పాల్గొన్నారు. సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, నారాయణ రెడ్డి, డాక్టర్ వీరయ్య, ఖాజా మైనుద్దీన్, బైరోజు చంద్రశేఖర్ పలువురు సాహితీవేత్తలు హాజరయ్యారు.

## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని మృతి బాధాకరం

**వైద్య సదుపాయాల లోపం వల్లే ఘటన**
**: డా. మార్షల్ దుర్గం నగేష్ ఆగ్రహం**

**అగ్నిదార న్యూస్ ,(పెద్దపల్లి):**

బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్న పీయూసీ రెండో సంవత్సరం విద్యార్థిని తేజస్విని మృతి చెందడం తీవ్ర విషాదకరమని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. క్యాంపస్‌లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడమే ఈ దుర్ఘటనకు కారణమని ఆయన ఘాటుగా విమర్శించారు.మెదక్ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన తేజస్విని కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఈ నెల 13న జ్వరం రావడంతో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆరోగ్యం క్షీణించడంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై స్పందించిన డా. మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ, క్యాంపస్‌లో ఆధునిక డయాగ్నోస్టిక్ సదుపాయాలు, నిపుణులైన వైద్య సిబ్బంది లేకపోవడం వల్ల విద్యార్థిని పరిస్థితి ముందుగానే గుర్తించలేకపోయారని ఆరోపించారు. ఇది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడినట్టేనని మండిపడ్డారు. విద్యార్థిని కుటుంబానికి కనీసం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో తక్షణమే ఆధునిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసి, డయాగ్నోస్టిక్ పరికరాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే మందుల సామేల్ ఇంటిపై దాడి హేయమైన చర్య

**ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు**
**: డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ (శామ్యూల్) నివాసంపై జరిగిన దాడిని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా ఖండించారు. బోడుప్పల్‌లోని ఎమ్మెల్యే ఇంటిపై బీజేవైఎం కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేసి ముట్టడించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ వాటిని హింసాత్మక చర్యల రూపంలో వ్యక్తం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో స్పందించాలే గానీ ఇలాంటి దాడులు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలు సమాజంలో అసహనాన్ని పెంచి ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో సంయమనం, సహనం అవసరమని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని డా. మార్షల్ దుర్గం నగేష్ సూచించారు.

## ఎస్సీ, ఎస్టీ హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**మాదిగ సంఘం విమర్శలు**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాదిగ శక్తి వేదిక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని మాదిగ విమర్శించారు. హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన పలు హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. అలాగే గతంలో బీఆర్ఎస్ పార్టీ ఈ హామీలను పట్టించుకునే విధంగా పలు ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. సామాజిక న్యాయం సాధనలో ప్రభుత్వ వైఖరి సరైన దిశలో లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా.ఆకెనపల్లిలో 'ఇందిరమ్మ ఇళ్ల' భూమి పూజ

**పేదల సొంతింటి కల సాకారం దిశగా ముందడుగు**

**అగ్నిధార న్యూస్ ,(అంతర్గాం):**

రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామంలో 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణ పనులు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్లకు సాంప్రదాయబద్ధంగా భూమి పూజ నిర్వహించారు. సర్పంచ్ గాదె స్రవంతి--సుధాకర్ ఆధ్వర్యంలో మెండే మల్లేశ్వరి--లక్ష్మణ్, గుర్రాల రమ్య--సది, ఐలవేణి లక్ష్మి--నర్సయ్య, ఉప్పులేటి స్వరూప--పర్వతాల కుటుంబాల గృహ నిర్మాణ పనులకు మండల అధికారులతో కలిసి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ తిరుపతి, ఎంపీఓ వేణు శాస్త్రోక్త పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్రవంతి--సుధాకర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, ఆకెనపల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సంజయ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. రమేష్, ఉపసర్పంచ్ ఐలవేణి అనసూర్య, వార్డు సభ్యులు మర్రి రాజ్‌కుమార్, ఆర్. సాగర్, ఉప్పులేటి శేఖర్, మల్లమ్మ, మమత, పద్మ, మెండే కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించినందుకు ఎమ్మెల్యేకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు

**గనుల శాఖల వద్ద ఏఐటియుసి ధర్నాలు..**
**అధికారులకు వినతిపత్రాలు**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం),:**

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఏప్రిల్‌లో సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఆర్జీ--1 ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్లు, ఓసీపీ--5 వద్ద ధర్నాలు నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.51 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త గనులు తక్షణమే కేటాయించాలని, ఏసీబీ విచారణ పేరుతో నిలిపివేసిన మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలని కోరారు.అదేవిధంగా సొంత ఇంటి పథకం అమలు, పెర్క్‌పై ఆదాయపు పన్ను యాజమాన్యం భరించడం, మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వడం, డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశం కల్పించడం వంటి డిమాండ్లను నెరవేర్చాలని తెలిపారు. సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని వారు కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 18 నుంచి 30 వరకు 'సేవ్ సింగరేణి' పేరుతో గోలేటి నుంచి కొత్తగూడెం వరకు పోరు జాత నిర్వహించి హెడ్‌ఆఫీస్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా ఈ నెల 22న గోదావరిఖనికి చేరుకునే పోరుజాత సందర్భంగా గోదావరి బ్రిడ్జి నుంచి చౌరస్తా వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఏప్రిల్‌లో సమ్మెకు పిలుపునివ్వడం ఖాయమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ--1 బ్రాంచి నాయకులు, ఫిట్ కార్యదర్శులు సంకె అశోక్, మాదన మహేష్, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, ఎస్. వెంకట్‌రెడ్డి, గండి ప్రసాద్, చెప్యాల భాస్కర్, దాసరి అనిల్, కే. విజయలక్ష్మి, దొంత సాయన్న, ఎం. చక్రపాణి, ఎం.ఏ. గౌస్, కలవేణి రాజేష్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో ఉగాది కవి సమ్మేళనం

**కవులు,**
**సాహిత్యాభిమానులకు ఆహ్వానం**

**అగ్నిధార న్యూస్,(ములుగు):**

ఉగాది పండుగను పురస్కరించుకుని ములుగు జిల్లాలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ సాహిత్య పరిషత్ మరియు రామప్ప సాహితీ సమితి ములుగు జిల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మార్చి 19న (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు ఎస్‌బీఐ రోడ్డులోని రామాలయంలో నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. సమ్మేళనంలో పాల్గొనే కవులను సన్మానించడం జరుగుతుందని తెలిపారు. ఉగాది సందర్భంగా సాహిత్య స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పండుగ వేళ కార్మికులకు జీతాలు లేక ఇబ్బందులు

**రామగుండం కార్పొరేషన్ అధికారులపై సుమలత రాజు ఆగ్రహం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు రామగుండం నగరపాలక సంస్థ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రామగుండం కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 550 మంది కార్మికులు నాలుగు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్మికుల జీతభత్యాల కోసం స్టాంప్ డ్యూటీ నిధులను డిపాజిట్‌గా ఉంచాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా, స్థానిక అధికారులు వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో కనీసం ఆరు నెలల జీతభత్యాలకు సరిపడా నిధులు నిల్వగా ఉంచాల్సి ఉండగా, ఆ నిధులను అభివృద్ధి పనుల పేరిట వినియోగించారని తెలిపారు. ఈ కారణంగా కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. జీతాలు అందక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల వద్ద తీసుకున్న రుణాల చెక్కులు బౌన్స్ అవుతూ సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చిన్న అవసరాల కోసం తీసుకున్న రుణాలకు వడ్డీపై వడ్డీ పడుతూ భారంగా మారిందన్నారు. అదే సమయంలో జీతాలపై ఫిర్యాదు చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులు ఉన్నాయని కూడా ఆమె ఆరోపించారు. కొంతమంది అధికారులు, నాయకులు టెండర్ల పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని, ఈ విషయంపై విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగునూరి సుమలత రాజు డిమాండ్ చేశారు.

# కోరుట్లకు చెందిన అంగన్వాడీ టీచర్‌కు జాతీయ అవార్డు

**తిరుపతిలో ఉమెన్ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు ప్రదానం.**

**అగ్నిదార న్యూస్, (తిరుపతి):**

సాహిత్యం, సామాజిక సేవ రంగాల్లో విశిష్ట కృషికి గుర్తింపుగా కోరుట్లకు చెందిన అంగన్వాడీ టీచర్ మేకల సాయిశ్వరీకు ఉమెన్ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఆధ్వర్యంలో మార్చి 15న తిరుపతిలో నిర్వహించిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ జాతీయ సదస్సులో ఈ అవార్డును ఘనంగా అందజేశారు. ఈ అవార్డును బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డా. యు. సుబ్రమనియన్ చేతుల మీదుగా సాయిశ్వరీ అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సాహిత్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రతి ఏడాది ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు.సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరైనట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ జి. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు తాటికంటి ఐలయ్య, బాదె వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# అపన్నులకు అండగా సీతారామ సేవా సమితి

**విషాదంలో ఉన్న రెండు కుటుంబాలకు సాయం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం) :**

క్లిష్ట సమయంలో అపన్నులకు అండగా నిలుస్తూ శ్రీ సీతారామ సేవా సమితి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది.ఇటీవల అనారోగ్యం, ఆత్మహత్యలతో కుటుంబాలను కోల్పోయిన రెండు కుటుంబాలకు సమితి సభ్యులు ఆర్థిక, నిత్యావసర సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎన్‌టీపీసీ ప్రశాంత్‌నగర్‌కు చెందిన చెరుకు రాధా అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని గుర్తించిన సమితి, రిపోర్టర్ కంది నాగరాజు సమాచారం మేరకు వెంటనే స్పందించింది. అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, గురువారం నిర్వహించనున్న దశదినకర్మ కార్యక్రమానికి సహాయంగా 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.అదనంగా కంది నాగరాజు వ్యక్తిగతంగా రూ.1000 నగదు సహాయం చేశారు.ఇక గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన సింగరేణి యువ కార్మికుడు భార్గవ్ ఆత్మహత్యతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఇప్పటికే భర్త, పెద్ద కుమారుడిని కోల్పోయిన తల్లి... ఇప్పుడు మిగిలిన ఒక్క కొడుకును కూడా కోల్పోవడంతో దుఃఖంలో మునిగిపోయింది. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. ఈ నేపథ్యంలో సమితి సభ్యులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ, సమితి సభ్యులు ప్రతి నెలా రూ.100 చొప్పున విరాళాలు సేకరించి అవసరమైన వారికి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కంది సుజాత, సరిత లక్ష్మి, శారద, శ్రీనివాస్, అట్లూరి శశికళ, గాదం సరితలక్ష్మి, ఇమ్మడి శారద, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సేవా కార్యక్రమాలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ నిరసన

**తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని, అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వితంతువులు, వృద్ధులకు పింఛన్లు, రైతులకు రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్ సకాలంలో చెల్లించాలని కోరారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులు, మహిళలు, రైతులు, వృద్ధుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ పెద్దపల్లి మండల శాఖ తరపున కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, దాడి సంతోష్, మేకల శ్రీనివాస్, వోల్లే తిరుపతి, కందుల సదయ్య, మామిడి ఉమేష్, శిరాలపు మహేష్, రెండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

